సాక్షి నిర్మల్

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



మూడు నియోజకవర్గాలు..
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మహిళల ప్రాతినిధ్యం తక్కువే ఉంది. మూడు నియోజకవర్గాల నుంచి ఆరుగురు ఎన్నిక కాగా.. మిగతా ఏడు చోట్ల అవకాశం దక్కలేదు. IIలో▸

అత్యవసర ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్



తెలంగాణ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో తొలిసారిగా జర్నలిస్ట్‌లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. 12 అత్యవసర సేవల రంగానికి చెందిన ఉద్యోగులు సైతం ఇకపై పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. IIలో▸

గరిష్టం/కనిష్టం
33.3 / 19.7

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

హస్తవాసి మారుతోంది!

- నేతల ఐక్యతారాగం
- చేరికలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్
- అసంతృప్తులకూ ప్రత్యామ్నాయం
- జిల్లాలో పుంజుకుంటున్న పార్టీ


నిర్మల్‌లో ఐక్యతను చాటుతున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు

నిర్మల్: కర్ణాటక ఎన్నికలకు ముందు జిల్లాలోనూ కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉండేది. ఏఐసీసీ నేతగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామారావు పటేల్, వారితోపాటు కీలక నేతలంతా బీజేపీలో చేరడంతో 'హస్త'వ్యస్తంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో ఒక్కొక్కరుగా సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత కూచాడి శ్రీహరిరావు, సీనియర్ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి, డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ తదితరులు చేరడంతో మళ్లీ పుంజుకుంది. పార్టీనే నమ్ముకుని ఉన్న ఆనంద్‌రావుపటేల్, విజయ్‌కుమార్‌రెడ్డి, భరత్‌చౌహాన్, వెడ్మ బొజ్జు, అర్జుమంద్‌అలీ తదితరులు బడా లీడర్లను కాంగ్రెస్‌లోకి తీసుకురావడానికి, మళ్లీ పార్టీని నిలబెట్టడానికి కృషిచేశారు. ఇదే క్రమంలో పార్టీ కూడా సీనియర్‌నేత, ఉద్యమకారుడిగా గుర్తింపు ఉన్న కూచాడి శ్రీహరిరావుకు జిల్లా పగ్గాలు అప్పగిస్తూ డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. అప్పటినుంచి కాంగ్రెస్ క్రమంగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో తన పాత బలాన్ని, బలగాన్ని పుంజుకుంటోంది. ఇప్పటికే నిర్మల్ అభ్యర్థిగా శ్రీహరిరావును ప్రకటించింది. రెండురోజుల క్రితం రాహుల్‌గాంధీ సమక్షంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ చేరడంతో ఆ రెండు నియోజకవర్గాల్లోనూ త్వరలోనే టికెట్ల విషయంలో స్పష్టత రానుందని కాంగ్రెస్‌వర్గాలు చెబుతున్నాయి.

చేరికలతోనే...
గ్రామస్థాయి నుంచి బడా నేతల దాకా అందరూ పార్టీ వీడటంతో కొన్నినెలల కిందటి దాకా కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా మారింది. తాజాగా పేరున్న నేతలు పార్టీలో చేరడంతో మళ్లీ బలంగా కనిపిస్తోంది. ఈక్రమంలోనే హస్తంలోకి తిరిగి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. ఓవైపు నిత్యం ప్రచారం చేస్తూనే.. మరోవైపు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పదుల సంఖ్యలో చేరికలను కొనసాగిస్తున్నారు. ఇందులో సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన ద్వితీయ శ్రేణి నేతలు ఉంటున్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ పార్టీనేతలు చేరికలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ముందుగా పార్టీని బలోపేతం చేయండి.. తర్వాత ఎన్నికల్లో గెలవండి.. అన్న కాంగ్రెస్ అధినేత రాహుల్ పిలుపు మేరకు పనిచేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయంగా..
జిల్లాలో బీఆర్‌ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ కనిపిస్తోంది. అధికార బీఆర్‌ఎస్‌లో సరైన ప్రాధాన్యత దక్కని, అసంతృప్తి ఉన్న నేతల చూపంతా హస్తం వైపే ఉంది. జనరల్ ఓట్లతోపాటు మైనార్టీ ఓట్లూ తమకే ఉంటాయన్న నమ్మకాన్ని కాంగ్రెస్ కలిగిస్తుండటంతో బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు హస్తంతో దోస్తీకి ఆసక్తి చూపుతున్నారు. ఇదేక్రమంలో ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఎక్కడా లేని విధంగా జిల్లాలో బలంగా ఉన్న బీజేపీలోని అసంతృప్త నేతలను, ముధోల్, ఖానాపూర్‌లో టికెట్ ఆశించి సీటు రాని ఆశావహులనూ పార్టీలోకి రప్పించే ప్రయత్నంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కలిసికట్టుగా..
జిల్లాలో ఇప్పుడిప్పుడే బలపడుతున్న కాంగ్రెస్‌పార్టీ కలిసికట్టుగా పోరాడేందుకు ప్రయత్నిస్తోంది. తమలో తమకు ఎన్నిఉన్నా.. గెలిచిన తర్వాత చూసుకుందామన్న పిలుపునిస్తోంది. జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధిస్తామంటోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధి పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓవైపు చేరికలు ప్రోత్సహిస్తూనే మరోవైపు పార్టీలో అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ముధోల్, ఖానాపూర్‌లోనూ టికెట్లు ఎవరికి వచ్చినా పనిచేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ గెలుపు కోసం పనిచేయాలని, గెలిచిన తర్వాత పదవులు పంచుకుందామని భరోసా ఇస్తున్నారు. కర్ణాటకలో ఎలాగైతే అధికారంలోకి వచ్చామో.. అలాగే ఇక్కడా గెలుస్తామని కార్యకర్తలు, నాయకులను ప్రోత్సహిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

సోనియా కృషితోనే తెలంగాణ

- కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ సహకారంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు అన్నారు. సారంగాపూర్ మండలం మలక్ చించోలి, కంకేట, జామ్ దుప్యా తండా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో శ్రీహరిరావు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్న కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని ఆశించిన ప్రజలకు, ఉద్యోగాలు వస్తాయని చూసిన యువతకు నిరాశే ఎదురైందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన నాయకులందరూ బీఆర్‌ఎస్‌ను వీడి కేసీఆర్‌ను గద్దె దించాలని కోరారు. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కబ్జాల మంత్రి, సండే ఎమ్మెల్యేకు బుద్ధి చెప్పాలన్నారు.

నందిగుండం అమ్మవారికి ప్రత్యేక పూజలు..
దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత అమ్మవారికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

బీజేపీలో ఫస్ట్‌లిస్ట్ రిలీజ్..!

- ఏలేటి, రాథోడ్ పేర్లు ఖరారు
- అభ్యర్థులకు ఫోన్‌చేసిన కిషన్‌రెడ్డి
- రెండోజాబితాలో ముధోల్!


ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


రమేశ్ రాథోడ్

నిర్మల్: బీజేపీ తొలిజాబితా దాదాపు ఖరారైంది. జిల్లాలోని నిర్మల్ నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఖానాపూర్ నుంచి రమేశ్ రాథోడ్‌కు పార్టీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు శనివారం సాయంత్రం వారిద్దరికీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సల్ స్వయంగా ఫోన్లు చేసి చెప్పారు. పోటాపోటీగా ఉన్న ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఇక్కడి నుంచి జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, సీనియర్లు రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్ టికెట్లు ఆశిస్తున్నారు. ముగ్గురూ బలంగా ఉండటంతో పార్టీ తుదినిర్ణయానికి రానట్లు తెలిసింది. రెండో జాబితాలో ఇక్కడి అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని పార్టీనేతలు పేర్కొన్నారు. మరోవైపు ఇక్కడి నాయకులు, కార్యకర్తలు ఇంకెంత జాప్యం చేస్తారని అసహనం వ్యక్తంచేస్తున్నారు.

ఇద్దరికీ ఫోన్లు..
ముందునుంచీ అనుకున్నట్లుగానే జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్ అభ్యర్థుల పేర్లను పార్టీ ఖరారు చేసింది. ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి కిషన్‌రెడ్డి ఫోన్‌చేయగా, రమేశ్‌రాథోడ్‌తో కిషన్‌రెడ్డి, సునీల్‌బన్సల్ మాట్లాడారు. ఇక గతానికి భిన్నంగా ముందుగా జాబితా బయటపెట్టకుండా నేరుగా, పోటీలో ఉన్న ఆశావహులకు ఫోన్లు చేసి చెప్పడం ఈసారి పార్టీ కార్యకర్తలు, నాయకులకే వింతగా అనిపించింది. తమ నేత పేరు ఖరారైందన్న విషయం సంబంధిత అనుచరులకే రాత్రి వరకు తెలియలేదు. సంబంధిత అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితా ఆదివారం వెల్లడించే అవకాశం ఉన్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్


నివాళులర్పిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయుధ దళ పోలీస్ కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ సలీం శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు వీరన్న, వెంకటేశ్వర్లు, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గజ్జలమ్మకు వెండి కిరీటం


కిరీటం అందజేస్తున్న ఒడ్నం గజ్జారాం

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ దేవికి రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి ఒడ్నం గజ్జరాం శనివారం అమ్మవారికి వెండి కిరీటం బహూకరించి మొక్కు చెల్లించుకున్నారు. 16 తులాల వెండి కిరీటం విలువ రూ.18 వేలు ఉంటుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లమ్మల శంకర్, సోమశంకర్, తోట గోపీచంద్, తాటి శివ, తురాటి గజ్జరాం తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు సెలవులు

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో నాలుగు రోజులు కొనుగోళ్లు నిలిపేయనున్నట్లు మార్కెట్ కమిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఆదివారం తోపాటు దసరా పండుగ నేపథ్యంలో 25 తేదీ వరకు యార్డులో భూసార్ బీట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి 26న కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు


ఎమ్మెల్యేకు మొక్కను అందజేస్తున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ బీఆర్‌ఎస్‌ను వీడీ రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం శనివారం ఖానాపూర్‌కు వచ్చారు. ఎమ్మెల్యేను పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మాసుల లక్ష్మీరాజం, దొంతుల గంగరాజం, ఎస్‌కే.సజ్జు, గంగారెడ్డి, సచిన్, డింపుల్, శ్రీనివాస్, సాయి తదితరులు ఉన్నారు.

'అభ్యర్థిని మారిస్తేనే పనిచేస్తాం'


రాజేశ్‌బాబుతో సమావేశమైన బీఆర్‌ఎస్ ముధోల్ ఇన్‌చార్జి పురాణం సతీశ్

లోకేశ్వరం: ముధోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డిని మారిస్తేనే పార్టీ గెలుపు కోసం పని చేస్తామని లేని పక్షంలో ఓటమి ఖాయమని ముధోల్ అసమ్మతి నేతలు భైంసా ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, శ్రీధర్, చిన్నరావు, రవీందర్‌రావు తేల్చిచెప్పారు. మండలంలోని రాజేశ్ తండాలోని అసమ్మతి నేత రాజేశ్‌బాబును పార్టీ ముధోల్ ఇన్‌చార్జి పురాణం సతీశ్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా అసమ్మతి నేతలు పలు అంశాలను పురాణం దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలను కేటీఆర్‌కు వివరిస్తానని పురాణం సతీశ్ తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి నిర్ణయాలుతీసుకోవద్దని సూచించారు. సమావేశంలో అసమ్మతివర్గం సభ్యులు కోటేశ్‌బాబు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిష్పక్షపాత ఎన్నికల కోసమే ర్యాండమైజేషన్


ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించడం కోసమే ఈవీఎంల ర్యాండమైజేషన్ చేపడుతున్నట్లు ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం నుంచి జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలు, సీయూ, వీవీప్యాట్‌ల తరలింపు కోసం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం ఈవీఎం గోదాంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసుకోగా, శనివారం ఉదయం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తెరిచి ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా నిర్మల్ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఖానాపూర్‌లోని కేబీ కాంప్లెక్స్, ముధోల్‌లోని రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసుకున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించి భద్రపరుస్తామని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అబ్జర్వర్ పర్యవేక్షణలో రెండోసారి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ డీఆర్వో లోకేష్, మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రత్నకల్యాణి, జీవాకర్, కోమల్‌రెడ్డి, సిరికొండ రమేశ్, గంద్రత్ రమేశ్, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, ఎస్‌ఎన్.రెడ్డి, గాజుల రవికుమార్, సయ్యద్ హైదర్, సయ్యద్ మజర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులదే కీలక పాత్ర
నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులది కీలక పాత్ర అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులకు, ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ, మాస్టర్ ట్రైనీలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీయూ, బీయూ, వీవీప్యాట్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికలకు సంబంధించి అధికారులకు కేటాయించిన విధులపై దిశానిర్దేశం చేశారు. ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లోకి మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. ఈవీఎంలు సిద్ధం చేయడం, పోలింగ్ నిర్వహణ, రవాణా, మాక్ పోలింగ్, రూట్ ఆఫీసర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణ ఎలా చేయాలో డెమో రూపంలో చూపించారు. పోలింగ్ సందర్భంగా చేయాల్సిన అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్‌ను ప్రతీ ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తప్పకుండా చదవాలన్నారు. అందులోని నియమాలు పాటించాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు చేయాల్సిన పనుల చెక్‌లిస్ట్ తయారు చేసుకుని, దాని ప్రకారం విధులు నిర్వహించాలని వివరించారు.

బతుకమ్మ సంబురాలు


జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వేడుకల్లో కోలాటం ఆడుతున్న కలెక్టర్ ఎస్పీ


చిరుధాన్యాల బతుకమ్మతో సారంగాపూర్ సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డీఆర్డీవో ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ పరిధిలోని వివిధ శాఖల మహిళలు తమ శాఖ డ్రెస్‌కోడ్‌తో హాజరై బతుకమ్మ ఆడారు. ఇక వివిధ శాఖల ఆధ్వర్యంలో తయారుచేసి తెచ్చిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. పౌష్టికాహారం, చిరుధాన్యాలు, కూరగాయలు, గాజులు, చేతివృత్తులతో తయారు చేసిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల్లో భాగంగా స్వీప్ (సిస్టమేటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) బతుకమ్మ కూడా ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ ఓటుహక్కు వినియోగించాలని సూచించారు.


బతుకమ్మ వేడుకల్లో స్టెప్పులు వేస్తున్న ఐకేపీ సిబ్బంది, యువతులు


బతుకమ్మతో చిన్నారులు



అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి..


కాగడా వెలిగిస్తున్న కలెక్టర్, ఎస్పీ


అమరవీరులకు కలెక్టర్ నివాళి..

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్
- ఘనంగా అమరవీరుల సంస్మరణ దినం
- అమర పోలీసులకు నివాళి..
- పోలీస్ అమరులను స్మరించుకుంటూ ర్యాలీ

నిర్మల్‌టౌన్: పోలీస్ అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీ శనివారం అమరవీరుల స్మారకార్థం కాగడాను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమర పోలీసుల కుటుంబాలతో మాట్లాడి, వారి పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత తొందరగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలు అందించారు. పోలీస్ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ.. పోలీస్ అమరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో, రాష్ట్ర భద్రతలో పోలీస్ కూడా అంతే కీలకమన్నారు. ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు, దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఇలా ప్రతీ సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందని పేర్కొన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నది పోలీసులు అన్నారు. ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని ఉండే ఒకే ఒక్కడు పోలీస్ అని తెలియజేశారు. 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిన రోజు అక్టోబర్ 21 అని వివరించారు. ఈ సమరంలో కొంత మంది పోలీసులు అమరులయ్యారన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందామని సూచించారు. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు అని వివరించారు. అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బంది, యువత పాల్గొని 54 యూనిట్ల రక్తదానం చేశారు.

అమరులను స్మరిస్తూ ర్యాలీ..
పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీస్ అమరులకు జోహార్లు అంటూ.. నినాదిస్తూ.. స్థానిక మంచిర్యాల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వీరన్న, వెంకటేశ్వర్లు, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్పీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు, ఆర్‌ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రద్ధతో వృత్తి నిర్వర్తించాలి

- భైంసా ఏఎస్పీ కాంతి లాల్ పాటిల్


నివాళులర్పిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

లోకేశ్వరం: పోలీసులు వృత్తిని శ్రద్ధతో నిర్వర్తించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అమరవీరుల సంస్మరణ దినం శనివారం నిర్వహించారు. బెల్లంపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అమరవీరుడైన లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ తండ్రి శేషయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అమరులైన పోలీసులు అందరిమదిలో ఉంటారన్నారు. పోలీసులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. అమరవీరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ముధోల్ సీఐ వినోద్, లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, ముధోల్ ఎస్సై సాయికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్దార్‌పటేల్ ప్రతిభ అవార్డుకు సుధీర్‌కుమార్


న్యాయవాది సుధీర్‌కుమార్

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ సర్దార్ పటేల్ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సంయుక్తంగా ఈ నెల 28న త్యాగరాయ గాన సభలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. సంగెం చారిటబుట్ ట్రస్టు ద్వారా సుధీర్‌కుమార్ అందిస్తున్న సేవలకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

అడవి దున్నను హతమార్చిన వ్యక్తులు అరెస్టు

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ టైగర్ జోన్ అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి విద్యుత్ తీగలు అమర్చి అడవి దున్నను హతమార్చిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు టైగర్ జోన్ అటవీ అధికారి గణేష్ తెలిపారు. శనివారం కార్యాలయంలో వివరాలను వెల్లడించాడు. బావోజీపేట్ అటవీ ప్రాంతంలో కొంతమంది విద్యుత్‌తీగలతో అడవి దున్నను హతమార్చిన విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పంచనామా నిర్వహించారు. దున్నకు సంబంధించిన తల, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. దున్నను హతమార్చిన మడవి అమృత్‌రావు, మడవి శ్యాంరావు, రాథోడ్ కుమార్‌లను అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన ముత్యం రామన్న (36) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లాండసాంగ్వి గ్రామానికి చెందిన రామన్న మేస్త్రి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటి స్లాబ్ వేశాడు. ఇదే క్రమంలో స్లాబ్‌పైకి ఎక్కిన రామన్న విద్యుత్ తీగలను గమనించకపోవడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య రాధ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామానికి చెందిన ప్రవళిక (30) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... ప్రవళిక మూడేళ్ల క్రితం మతిస్థితిమితం కోల్పోయింది. కుటుంబీకులు ఆసుపత్రుల్లో చూయించినా నయంకాలేదు. గతకొన్ని రోజులుగా ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి తిరిగి వస్తుండేది. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు నియోజకవర్గాలు.. ఆరుగురు మహిళలు

- ఉమ్మడి జిల్లాలో ఆమె ప్రాతినిధ్యం తక్కువే
- ఓటర్లు ఎక్కువ.. పోటీ తక్కువ
- ఏడు నియోజకవర్గాల్లో దక్కని అవకాశం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు ఆరుగురు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో నియోజకవర్గంలో ముగ్గురు, సిర్పూర్ నియోజకవర్గంలో ఒక్కరు, ఖానాపూర్ నియోజకవర్గంలో ఇద్దరు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మిగిలిన ఏడు నియోజకవర్గాలు ఆదిలాబాద్, బోథ్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, నిర్మల్, ముధోల్ నుంచి ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా గెలుపొందలేదు. – మంచిర్యాలటౌన్/భైంసాటౌన్

ఆసిఫాబాద్‌లో ముగ్గురు..




పాటి సుభద్ర అమరాజుల శ్రీదేవి కోవ లక్ష్మి

కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. ఇప్పటి వరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించగా ముగ్గురు మహిళలు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించారు. జిల్లాలో ఎన్నో ప్రత్యేకతలు, చారిత్రక ఉద్యమాలకు నెలవుగా ఉన్న ఆసిఫాబాద్ నియోజకవర్గం 31 ఏళ్లుగా ఎస్సీ రిజర్వ్‌డ్‌గా సాగినా, పునర్విభజనలో భాగంగా ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారింది. 1999లో బెల్లంపల్లికి చెందిన వైద్యురాలు పాటి సుభద్ర తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దాసరి నర్సయ్యపై గెలుపొందారు. 2004లో బెల్లంపల్లికే చెందిన అమరాజుల శ్రీదేవి టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి కోవ లక్ష్మి పోటీచేసి గెలుపొందారు.

సిర్పూర్ నుంచి ఒక్కరు..


పాల్వాయి రాజ్యలక్ష్మి



1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుమురంభీం జిల్లా సిర్పూర్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పాల్వాయి రాజ్యలక్ష్మి మొదటి మహిళా శాసన సభ్యురాలిగా గెలుపొందింది. అప్పటి వరకు ఎన్నికల బరిలో నిలిచిన పాల్వాయి పురుషోత్తంరావు ఎన్నికల నామినేషన్ సమయంలో ఒక్కరోజు ముందు నక్సలైట్ దాడిలో మృతి చెందడంతో అతని భార్య రాజ్యలక్ష్మికి టికెట్ కేటాయించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు.

ఖానాపూర్ నుంచి ఇద్దరు...




రాథోడ్ సుమన్ భాయి అజ్మీరా రేఖానాయక్

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఇద్దరు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2009లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాథోడ్ సుమన్‌బాయి గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి అజ్మీరా రేఖానాయక్ రెండుసార్లు విజయం సాధించారు.

అత్యవసర ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

- 13 శాఖలను గుర్తించిన ఈసీ
- ఎన్నికల విధుల్లోని జర్నలిస్టులకూ అవకాశం
- శాఖకో నోడల్ అధికారి నియామకం



నిర్మల్ చైన్‌గేట్: తెలంగాణ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో తొలిసారిగా జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. అయితే ఆరోజు జర్నలిస్టులు ఎన్నికల వార్తల సేకరణ విధుల్లో ఉండాలి. అంతే కాకుండా ఎన్నికల కమిషన్ నుంచి పాసులు పొందాలి. జర్నలిస్టులతో పాటు ఎన్నికలతో సంబంధం లేని 12అత్యవసర సేవల రంగానికి చెందిన ఉద్యోగులు సైతం ఇకపై పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

గెజిట్ జారీ...

చాలా మంది అత్యవసర సేవల రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ ఉద్యోగ స్వభావం రీత్యా ఓటు హక్కు ఉన్న ప్రాంతానికి దూరంగా ఉంటున్నారు. వారు తమ ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో వీరికి సైతం ఓటు హక్కు కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 10న ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 60(సీ) కింద ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశాయి.

ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం..

ఇప్పటి వరకు కొంత మందికి మాత్రమే బ్యాలెట్ ఓటు వేసే అవకాశం ఉండేది. వారిలో ఎన్నికల విధుల్లో పనిచేసే సిబ్బంది, సర్వీసు ఓటర్లు (సాయుధ బలగాలు), ప్రవాస ఓటర్లు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేవారు. అయితే ఈసారి ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 40శాతం, ఆపై వైకల్యం కలిగిన దివ్యాంగులు, 80ఏళ్లకు పైబడిన ఓటర్లకు ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనుంది. అలాగే జర్నలిస్టులు, ఎన్నికల విధులతో సంబంధం లేని అత్యవసర సేవల విభాగాల ఉద్యోగులకు సైతం పోస్టల్ సదుపాయం కల్పిస్తోంది.

ఎవరెవరికి బ్యాలెట్ ఓటు వేసే అవకాశం..
కేంద్ర ఎన్నికల కమిషన్ పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. ఎయిర్‌పోర్టు ఆథారిటి ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్‌శాఖ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ), పౌర సరఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజు వార్తల సేకరణ కోసం ఎన్నికల సంఘం నుంచి పాస్ పొందిన జర్నలిస్టులు, అగ్నిమాపక శాఖ అధికారులు బ్యాలెట్ ఓటు వేయవచ్చు.

ప్రత్యేక నోడల్ అధికారి...

జర్నలిస్టులు, అత్యవసర విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. నోడల్ అధికారుల వద్ద ఫారం–12డీ అందుబాటులో ఉంచాలని కోరింది. బ్యాలెట్ ఓటు వేయదలిచిన వారు దానిని నింపి స్థానిక ఎన్నికల అధికారికి సమర్పించాలి. వచ్చే నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. అప్పటి నుంచి 5 రోజుల్లోగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ 'ఫారం–12డీ' దరఖాస్తులను స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నవంబర్ 7నాటికి దరఖాస్తులు రిటర్నింగ్ అధికారికి చేరితే వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తారు.

కేసీఆర్‌ను కలిసిన సత్తన్న


సీఎం కలిసిన సత్యనారాయణగౌడ్, మంత్రి

నిర్మల్: ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీ అసంతృప్త నేతలను సముదాయించే పనిలో పడింది. ఈక్రమంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్ దంపతులతోనూ చర్చించింది. తెలుగుదేశంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా పోటీచేసిన సత్యనారాయణగౌడ్‌కు ఇప్పటికీ నిర్మల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పట్టు ఉంది. ఈక్రమంలోనే కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న ఆయనను తిరిగి పార్టీ గెలుపు కోసం పనిచేసేలా మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, నియోజకవర్గానికి చెందిన నేతలు సముదాయించారు. ఈమేరకు శనివారం ప్రగతిభవన్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్యనారాయణగౌడ్ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భవిష్యత్తుపై హామీ..
ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని సీఎం కేసీఆర్ సత్యనారాయణగౌడ్‌కు సూచించారు. భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: తెలంగాణ ఉద్యమాన్ని దేశరాజదాని ఢిల్లీతో పాటు ప్రపంచ దేశాలకు తెలిసేలా చేసిన జర్నలిస్టులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు జర్నలిస్టులకు ప్లాట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామన్న ప్రభుత్వం ఆ తర్వాత స్పందించలేదన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ప్లాట్లు, ఇళ్ల విషయమై ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ పట్టణంలో 110 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం గుంట భూమిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు న్యాయం చేస్తామన్నారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవ్వరికి ఇచ్చినా గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. కడెం డ్యాం సమస్యపై ప్రభుత్వంలోని ఏ ఒక్కరూ స్పందించలేదన్నారు. మంత్రి కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ ఓటమి ఖాయమన్నారు.

బాసరలో భక్తుల రద్దీ


గోదావరిలో స్నానాలుచేస్తున్న భక్తులు

భైంసా: బాసరలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఏడో రోజైన శనివారం సరస్వతీ అమ్మవారు కాళరాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలోనే బాసర వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సరస్వతీ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరిపించారు. బాసర ఎస్సై గణేశ్ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ముస్లిం భక్తులు...
బాసర సరస్వతీ అమ్మవారిని శనివారం ముస్లిం భక్తులు దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఈ కుటుంబీకులు గతంలోనూ బాసర వచ్చినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులంతా ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానంలో పాల్గొన్నారు.

ఒమన్‌లో బతుకమ్మ సంబరాలు



ఖానాపూర్: గల్ఫ్ దేశం ఒమన్‌లో శుక్రవారం రాత్రి ఒమన్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ గుండేటి గణేశ్, కో–కన్వీనర్ నూనె లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో ఆల్ అమాల్ క్లబ్ వేదికలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబిచేలా మహిళలు సద్దుల బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడిపాడారు.

విద్యుత్ షాక్‌తో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

- ఇటీవలనే భార్య అనారోగ్యంతో మృతి
- అనాథలైన పిల్లలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ గ్రామంలో విద్యుత్‌షాక్‌తో ట్రాక్టర్ డ్రైవర్ యోగేష్ లక్ష్మణ్ గైక్వాడ్ (45) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. యోగేష్ భార్య 11నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ అతడి ఐదుగురు పిల్లలను పోషిస్తున్నాడు. పనికి వెళ్లి వచ్చి శనివారం పిల్లలకు వంటచేస్తున్న క్రమంలో వంట గ్యాస్ సమీపంలోని స్టీల్ ర్యాక్‌కు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుమారుడు ఏమైందని తండ్రిని ముట్టుకోగా అతడికి సైతం షాక్ తగిలింది. దీంతో అలర్ట్ అయిన కుమారుడు కర్రను తీసుకుని వచ్చే క్రమంలోనే తండ్రి మృతి చెందాడు. దీంతో పిల్లల రోదనలు మిన్నంటాయి. ఆ పిల్లలు అనాథలుగా మిగిలారు. వారిని చూసిన స్థానికులు కంటతడిపెట్టారు.

మానవత్వం చాటుకున్న జాన్సన్‌నాయక్


గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న జాన్సన్‌నాయక్

కడెం: ప్రమాదంలో గాయపడిన యువకుడిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్. మండలంలోని ఉడుంపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ శనివారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. దే సమయంలో కడెం మండల పర్యటనకు వెళ్లి వస్తున్న జాన్సన్‌నాయక్ తన వాహనాన్ని నిలిపి క్షతగాత్రుడిని తన వాహనంలో ఖానాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

మద్యం పట్టివేత

ఎదులాపురం: పట్టణంలోని ఠాకూర్ హోటల్ ప్రాంతంలో శనివారం 30క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్నట్లు టూ టౌన్ పోలీసు అధికారి ప్రదీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ మండలం చాందా (టి)కి చెందిన కుంబోజి అశోక్ పట్టణంలో 30క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి ఠాకూర్ హోటల్ మీదుగా చాందా(టి)కి వెళ్తుండగా పట్టుకుకుని సదరు వ్యక్తిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని, అక్రమంగా మద్యం నిల్వచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద భార్యపై భర్త అతడి బంధువులు దాడిచేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ దినేశ్‌తో సునీతకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం దినేశ్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. సునీతను హైదరాబాద్‌లో ఉంచి పోషిస్తున్నాడు. అయితే గత కొన్ని రోజులుగా ఆమెను దూరం పెడుతూ వస్తుండడంతో శనివారం ఈ విషయమై భర్త దినేశ్‌ను అడిగేందుకు ఆదిలాబాద్ జిల్లా కేందారనికి వచ్చింది. దీంతో భర్త దినేశ్, అతడి తల్లి, చెల్లి, అతడి మొదటి భార్య సునీతపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు


పట్టుకున్న నగదుతో ఎస్సైలు పూర్ణేశ్వర్, సందీప్

భైంసాటౌన్: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా చేపట్టిన తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2,61,690 నగదును పట్టుకున్నట్లు సీఐ శ్రీను తెలిపారు. పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో ఎస్సైలు పూర్ణేశ్వర్, సందీప్ వాహన తనిఖీలు చేపట్టగా మహేశ్ అనే వ్యక్తి వద్ద నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రూ. 10లక్షలు పట్టివేత
బేల: మండలంలోని శంకర్‌గూడ గ్రామ శివారులోని అంతర్రాష్ట్ర ఎన్నికల చెక్‌పోస్టు వద్ద శనివారం సాయంత్రం పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీల్లో రూ.10 లక్షలు పట్టుకున్నారు. మహారాష్ట్రలోని గడ్‌చాందుర్‌కు చెందిన ఉద్గిరే హరిబావు బేల మార్గంలో మహారాష్ట్రలోని నాందేడ్‌కు ప్లాటు కొనుగోలు కోసం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో చెక్‌పోస్టు వద్ద ఎటువంటి పత్రాలు లేకుండా రూ.10లక్షల నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ మహేందర్‌కుమార్, ఏఎస్సై కినక జీవన్ పాల్గొన్నారు.